17-02-2017 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - మీరిప్పుడు ఈశ్వరీయ ఖజానాలతో పాలింపబడుతున్నారు. మీ కర్తవ్యము - జ్ఞాన ఖజానాలను పంచి అందరి కళ్యాణము చేయడం "

ప్రశ్న:- మాయా గ్రహచారము రావడం వల్ల పిల్లలు ఏ ఆశ్చర్యకరమైన ఆట ఆడ్తారు ?

**సమా :-** గ్రహచారమొచ్చినప్పుడు ఇలాంటి అత్యంత శ్రేష్ఠమైన తండ్రి, టీచరు, సద్గురువు ముగ్గురినీ మర్చిపోతారు. ఆశ్చర్యము కదా. మంచి మంచి నిశ్చయబుద్ధి గల పిల్లలు కూడా మేము ఒప్పుకోము, నమ్మము అని అంటారు. ఆశ్చర్యకరముగా వింటారు, వర్ణిస్తారు మళ్లీ పారిపోతారు. ఈ రోజు మమ్మా-బాబా అని అంటారు రేపు మాయమైపోతారు, వారి అడ్రస్సు కూడా తెలియదు. కానీ బాబా అంటారు - మళ్లీ అందరూ వస్తారు. ఎందుకంటే అందరికీ శరణాగతి ఈ తండ్రి వద్ద మాత్రమే లభిస్తుంది.

**పాట:- ఓం నమ: శివాయ.............**

ఓంశాంతి. ఈ పాటను పిల్లలు సమయ ప్రతి సమయము వింటూనే ఉన్నారు. తమ పారలౌకిక పరమపిత పరమాత్మను స్మృతి కూడా చేస్తారు. ఎవరి ద్వారా ఏదో కొంత సుఖము లభిస్తుందో వారినే స్మృతి చేస్తారు. బనారస్‌లో శివుని మందిరముంది. అచ్చటకు చాలామంది వెళ్తారు. నిరాకార తండ్రిని స్మృతి చేస్తారు. ఉదాహరణానికి లక్ష్మీనారాయణులను అందరూ స్మృతి చేస్తారు. ఎందుకనగా వారి రాజ్యములో అందరికీ సుఖముండేది. అందుకే రాజా-రాణులను మహిమ చేస్తారు. మొత్తం ప్రపంచమంతా **ఓ గాడ్ ఫాదర్!** అని స్మృతి చేస్తుంది. వారొక్కరు మాత్రమే ప్రపంచమంతటికీ ఫాదర్! ఇతరులెవ్వరూ వరల్డ్‌కు(ప్రపంచానికి) ఫాదర్ కారు. వరల్డ్ ఫాదర్(జగత్పిత) నిరాకార గాడ్ (భగవంతుడు). వారొక్కరినే అవతరించారు అని అంటారు. అనగా రీ ఇన్‌కార్నేషన్(పునరవతరణ) అని కూడా అంటారు. ఆ ఒక్క తండ్రికి మాత్రమే తమ స్వంత సూక్ష్మ శరీరము గానీ, స్థూల శరీరము గానీ లేవు. బ్రహ్మా-విష్ణు-శంకరులకు కూడా సూక్ష్మ శరీరముంది. వారిని కూడా అవతారమని అనరు. అవతారమనే పదము చాలా ఉన్నతమైనది(శ్రేష్ఠము). వారు అందరికీ తండ్రి. అందరికీ సుఖమిచ్చే పతితపావనుడు. మానవాత్మలందరూ ఎవరైతే ఇచ్చటకు వస్తారో వారు మొదట సతోప్రధానంగా ఉండి తర్వాత సతో, రజో, తమోలోకి వస్తారు. వారు పతితులుగా, దు:ఖితులుగా అవ్వనే అవ్వాలి. పునర్జన్మ అయితే అందరూ తీసుకుంటారు కదా. బ్రహ్మను కూడా మనుష్యుడని అంటారు. విష్ణువు రెండు రూపాలైన లక్ష్మీనారాయణులను కూడా మనుష్యులనే అంటారు. కావున వారిని కూడా మనము అవతారమని అనరాదు. అవతరించేవారు ఒకే ఒక్కరు. వారసత్వమునిచ్చేందుకే తండ్రి వస్తారు. మొత్తం ప్రపంచమంతా పతితమైనప్పుడు మాత్రమే వారు వస్తారు. మనుష్యులందరూ గాడ్‌ఫాదర్ రచనయే. భిన్న-భిన్న నామ-రూపాలతో అందరూ తప్పకుండా గాడ్‌ఫాదర్ అని అంటారు. ప్రతీ ఆత్మలోని బుద్ధి ఆ తండ్రినే స్మృతి చేస్తుంది. బ్రహ్మ, విష్ణు, శంకరులను స్మృతి చేయదు. బ్రహ్మ, విష్ణు, శంకరులను తండ్రి అని అనరు. తండ్రి అని ఒక్క సృష్టికర్తను మాత్రమే అంటారు. ఎప్పుడైతే సంగమ యుగము వస్తుందో, మనుష్యులందరూ పతితమైపోతారో అప్పుడు తండ్రి కల్పము యొక్క సంగమ యుగములో,

కలియుగమును సత్యయుగముగా పరివర్తన చేసేందుకు అవతరిస్తారు. వారు క్రియేటర్(సృష్టికర్త) కదా. బ్రహ్మ ద్వారా స్థాపన, శంకరుని ద్వారా వినాశనము, విష్ణువు ద్వారా పాలన చేయిస్తారని చూపుతారు. వారు భారతదేశములోనే వస్తారు. శివరాత్రి కూడా భారతదేశములో మాత్రమే జరుపుకుంటారు. కానీ వారికి శివుని నామ, రూప, దేశ, కాలములేవో తెలియదు. తండ్రి అంటున్నారు - నేనెవరో తెలియనందున నన్ను సర్వవ్యాపి అని అనేస్తారు. నన్ను చాలా గ్లాని చేస్తారు. అందువల్లనే భారతవాసులు పూర్తిగా పతితమైపోయారు. ఎప్పుడైతే భారతదేశములో అందరూ పతితాత్మలుగా అవుతారో అప్పుడు నేను మరలా వస్తాను. కలియుగములో పుణ్యాత్మ, పవిత్ర ఆత్మ ఒక్కరు కూడా ఉండరు. పవిత్ర ప్రపంచములో పవిత్ర ఆత్మలే ఉంటాయి. దానిని సంపూర్ణ నిర్వికార ప్రపంచమని అంటారు. దానికి పోలుస్తే కలియుగము వికారీ ప్రపంచము, కలియుగ అంతమును మరియు సత్యయుగము ఆదిని సంగమ యుగమని అంటారు. ద్వాపర - త్రేతాలను కలపరు. అంత్యమనగా మొత్తం పాత ప్రపంచమంతటి అంతిమము. నూతన ప్రపంచము యొక్క ఆది సత్యయుగము పావన ప్రపంచము. మళ్లీ కళలు తగ్గిపోతూ వస్తాయి. సత్య-త్రేతా యుగాలలో కూడా కళలు సమానంగా ఉండవు. తండ్రి అంటున్నారు - పిల్లలు కూడా నన్ను నెంబరువారుగానే తెలుసుకున్నారు. ఈ సమయములోనే ఈ మాట అంటారు. ఎందుకనగా మాయ ఎదురుగానే నిలబడి ఉంది. మాటి మాటికి మరపింపజేస్తుంది. మేము బ్రహ్మ పిల్లలము, శివుని పౌత్రులమని అంటారు. ఇలా అంటూ కూడా మర్చిపోతారు. అజ్ఞానములో ఇటువంటి మాటలు ఎప్పుడూ మర్చిపోరు. ఇచ్చట నా ఎదుటనే ముఖం మీదే మేము బ్రహ్మ పిల్లలము కాము అని అంటారు. పూర్తిగా మర్చిపోతారు. ఎంత మర్చిపోతారంటే, తర్వాత ఎప్పుడూ స్మృతి కూడా చేయరు. ఇది చాలా పెద్ద ఆశ్చర్యము. స్వర్గమును తయారు చేయువారు పరమపిత పరమాత్మ అని, నరకమును తయారుచేయువారు మాయ రావణుడని భారతవాసులకు తెలుసు. మళ్లీ ఈ రెండు విషయాలు మర్చిపోతారు. తండ్రిని గురించి తెలియదు, రావణుని గురించి తెలియదు. శివుని పూజిస్తారు. రావణుని తగులబెడ్తారు. కానీ ఆశ్చర్యమేమంటే ఎవరిని పూజిస్తారో, వారి కర్తవ్యము గురించి, జీవిత చరిత్రను గురించి ఎవ్వరికీ తెలియదు. తగులబెట్టే రావణుడంటే ఎవరో తెలియదు. మానవ మాత్రులు యథా రాజా-రాణి తథా ప్రజ అందరూ అందులోకి వచ్చేస్తారు. అందరూ తుచ్ఛ బుద్ధి గలవారే. తండ్రి అర్థము చేయిస్తున్నారు - ఎవరైతే వేరే ధర్మాలను స్థాపన చేసేందుకు వస్తారో వారిని అవతారాలని అనరు. ఒక్క తండ్రి మాత్రమే భారతదేశములో అవతరిస్తారు కానీ భారతవాసులే మర్చిపోతారు. భలే పరమపిత పరమాత్మను పూజిస్తారు కానీ వారు ఎప్పుడు వచ్చారో, ఏమి చేశారో, ఏమీ తెలియదు. తండ్రిని గురించి గానీ, వారి రచన ఆది మధ్య అంత్యమును గురించి గానీ తెలియదు. దేవీ దేవతల జీవిత చరిత్రలు కూడా తెలియదు. అందుకే దు:ఖితులుగా ఉన్నారు. భారతవాసులు మొదట ఎంతో సుఖంగా ఉండేవారు. పూర్తి విశ్వమంతటికి యజమానులుగా ఉండేవారు. ఇప్పుడు ఆ భారతవాసులకు మేము పావన శ్రేష్ఠాచారులుగా ఉండేవారమని వారికే తెలియదు. ఒకవేళ ఉండి ఉంటే అంత శ్రేష్ఠముగా ఎలా తయారయ్యారో ఏమాత్రమూ తెలియదు. ఇది ఆశ్చర్యము కదా. తండ్రి ఎంతో స్పష్టము చేసి అర్థం చేయిస్తున్నారు. ఎవరికి అర్థం చేయిస్తారు? నా పిల్లలకు మాత్రమే అర్థం చేయిస్తాను. పిల్లల ముందు మాత్రమే ప్రత్యక్షమౌతాను. కానీ పిల్లలు కూడా ప్రత్యక్షమవ్వాలి. మమ్మా, బాబా అని మళ్లీ మర్చిపోతారు.

ఇదే ఆశ్చర్యము. అజ్ఞాన కాలములో ఎప్పుడూ తండ్రి, టీచరు, గురువులను మర్చిపోరు. ఇచ్చట ఇంత గొప్ప పారలౌకిక తండ్రి, ఎవరైతే అందరి దు:ఖాలను దూరము చేస్తారో, వారిని మర్చిపోతారు. అందుకే ఆశ్చర్యవంతముగా వింటారు, వర్ణిస్తారు. అహో నా మాయ నీవు ఎంత శక్తిశాలివి? బేహద్ తండ్రి వారుగా అవుతారు. టీచరుగా తెలుసుకొని, వారి నుండి చదువుకుంటూ పతితపావనులైన సద్గురువును పక్కాగా అర్థం చేసుకొని కూడా, ముగ్గురినీ మర్చిపోతారు. ఒకరిని మర్చిపోతే ముగ్గురినీ మర్చిపోతారు. ఒకరిని స్మృతి చేస్తే ముగ్గురూ గుర్తుకొస్తారు. ఎందుకంటే ముగ్గురూ కంబైండుగా ఉన్నారు. స్వయం వారే తండ్రి, టీచరు, సద్గురువు. అది కూడా ఆక్యురేట్. వారంటున్నారు - నేను మీ తండ్రిని, మిమ్ములను తప్పకుండా మన పరంధామానికి తీసుకెళ్తాను. నేను మీ టీచరును. చదివించి మిమ్ములను తప్పక రాజాధి-రాజులుగా చేస్తాను. నేను సద్గురువును పిల్లలైన మిమ్ములను నెంబరువారు పురుషార్థానుసారము అందరినీ తప్పకుండా వాపస్ తీసుకెళ్తాను. ఈ గ్యారంటీ ఇస్తున్నారు. ఇటువంటి తండ్రిని కూడా నడుస్తూ-నడుస్తూ మర్చిపోతారు. మాయ గ్రహచారము ఎలాంటిదంటే ఈ రోజు బాబా అని అంటారు. రేపు మాకు సంశయము కలుగుతూ ఉందని అంటారు. ఇలానే జరుగుతూ ఉంటుంది. అయితే కొందరు అంత్యములో మళ్ళీ వచ్చి వారసత్వము తీసుకుంటారు. గ్రహచారము దిగిపోతే వచ్చేస్తారు. డ్రామాలో ఈ విధంగా ఫిక్స్ అయ్యి ఉంది. వినాశనమయ్యే తీరాలి. మరి ఎవరి శరణు జొచ్చుతారు? సర్వుల సద్గతిదాత ఒకే ఒక్కరు - అందరినీ శరణులోకి తీసుకునేవారు కూడా వారే. అందరూ వచ్చి వారికే తల వంచి నమస్కరిస్తారు. కానీ ఆ సమయములో ఏమి చేయగలరు. అలా జరిగినప్పుడు అంత జనము కలసి రాలేరు. ఇది చాలా అద్భుతముగా తయారైన డ్రామా. అంతమంది గుంపుగా వచ్చి ఏం చేస్తారు? వెంటనే వినాశనం వచ్చేస్తుంది. ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి అని తండ్రి చెప్తున్నారనే శబ్దము మాత్రము వింటారు. కానీ అప్పుడు వచ్చి కలియుట వలన లాభమేముంది? బాబా డైరెక్షన్ ఇస్తారు - భలే ఎవరైనా విదేశాలలో ఉన్నా తండ్రిని స్మృతి చేస్తూ ఉంటే వికర్మలు వినాశనమౌతాయి. అంతమతి సో గతి అయిపోతుంది. అందరికీ సందేశమైతే లభించే తీరాలి. ఇంతమంది ఒకే చోట కలవలేరు. కానీ ఈ డ్రామా చాలా వండర్‌ఫుల్‌గా(అద్భుతముగా) తయారయ్యింది. తండ్రి వచ్చి ఉన్నారని అందరికీ తెలిసిపోతుంది. క్రైస్తవులందరూ పోపుతో కలవరు. అందరూ అచ్చటికి పోలేరు. తండ్రి వచ్చి ముక్తినిచ్చి అందరినీ తీసుకెళ్లేందుకు వచ్చారని చివర్లో అందరికీ తెలిసిపోతుంది. చాలా పెద్ద వినాశనము జరుగనున్నది. రుద్రమాల చాలా పెద్దది. దీనితో పోలిస్తే విష్ణుమాల చాలా చిన్నది. ఈ మాల అంతా విష్ణువుదే అని అనాలి. మొట్టమొదట విష్ణువే ఉంటాడు. మానవుల గ్రేట్ గ్రేట్ గ్రాండ్‌ఫాదర్ బ్రహ్మయే. బ్రహ్మయే మళ్ళీ విష్ణువుగా అవుతాడు. విష్ణువు యొక్క రెండు రూపాలు లక్ష్మీ-నారాయణులు. తేడా ఏమీ లేదు. ఇవి చాలా ఆశ్చర్యకరమైన విషయాలు. వీటిని స్మరణ చేస్తూ ఉంటే సంతోషంగా ఉంటుంది. బాబా అర్థం చేయించారు - మరలా అవతరించారు అని ఒక్కరినే అంటారు. ఎందుకంటే వారికి తమ స్వంత శరీరము లేదు. మిగిలిన వారందరికీ తమ-తమ శరీరాలున్నాయి. బాబా అయితే శరీరమును అప్పుగా తీసుకోవలసి వస్తుంది. మిగిలిన వారందరికీ తమ-తమ శరీరాలున్నాయి. అప్పుగా తీసుకున్న వస్తువు ఇతరులదౌతుంది. ఏ ఆత్మ కూడా నేను లోనుగా తీసుకున్నానని చెప్పదు. ఇది నా శరీరమని ఆత్మ అంటుంది. ఇది నా శరీరమని శివబాబా అనలేరు. పిల్లలకు జ్ఞానమిచ్చేందుకు, యోగము నేర్పించేందుకు వారు కేవలం

ఆధారమును తీసుకుంటారు. బాబా ఆధారముగా తీసుకున్నారని పిల్లలకు కూడా తెలుసు. తెలిసినా మాటిమాటికి మర్చిపోతారు. దేహాభిమానులుగా అవుతారు కనుక ఆ గౌరవము అదృశ్యమైపోతుంది. లేకుంటే బాబా ఎవరో తెలిసిపోతే, వారి ఆజ్ఞానుసారము తప్పక నడుస్తారు. అడుగడుగునా శ్రీమతమును తీసుకోవాల్సి వస్తుంది. కానీ మాయ మరపింపజేస్తుంది. అప్పుడప్పుడు శ్రీమతము పై, అప్పుడప్పుడు ఆసురీ మతము పై నడుస్తారు. అటువైపు ఒకసారి భారము, ఒకసారి తేలిక, అపుడప్పుడు వారి మతమును, అప్పుడప్పుడు వీరి మతమును అనుసరిస్తారు. ఒకే శివబాబాగారి శ్రీమతమును అనుసరిస్తూ ఉంటే బాగుంటుంది. ఉన్నతంగా కూడా అవుతూ ఉంటారు. కానీ స్వంత మతము పై కూడా నడుస్తూ ఉంటారు. తండ్రి ఆదేశాలు మొదలైనవి ఇస్తూ ఉంటారు. వాటిని తప్పక అమలు పరుస్తూ ఉండాలి. తర్వాత ఏదైనా జరిగితే డ్రామాలో ఈ విధంగా ఉండినదని అంటారు. రాజధాని అయితే తప్పక స్థాపన కానున్నది. ఇందులో కొంచెము కూడా తేడా రాదు. కలుసుకునేందుకు అయితే చాలామంది వస్తారు. ఇంటికి పోతూనే సమాప్తము. సంపూర్ణ నిశ్చయముతో రారు. కొంతమందికి 5 శాతము నిశ్చయముంటే, కొంతమందికి 15 శాతము నిశ్చయముంది. అజ్ఞాన కాలములో వీరు మా మామ, మా చిన్నాన్న అని తెలిసినప్పుడు సంశయమే రాదు. ఇచ్చట మాయ సంశయములోకి తెచ్చి క్రింద పడేస్తుంది అనగా నిశ్చయమే కలుగలేదు. నిశ్చయము కలుగుతూ కలుగుతూ మళ్ళీ అదృశ్యమైపోతారు. ఆశ్చర్యము కదా. వీరు ఒక్కరు మాత్రమే తండ్రి, టీచరు, సద్గురువు అయ్యారు. ప్రతి ఒక్కరు నెంబరువారు పురుషార్థానుసారము కల్పక్రితము వలె నెంబరు తీసుకుంటారు. కల్పక్రితము ఎవరు ఎంత వారసత్వము తీసుకున్నారో ప్రతి ఒక్కరికీ అదే పాత్ర నడుస్తూ ఉంది. ఈ సమయములో బ్రాహ్మణులైన మన మాల తయారు కాజాలదు. ఎందుకనగా గ్రహచారము వస్తూ ఉంటే పడిపోతారు. మళ్ళీ ప్రజల మాలలో వస్తారు. ప్రజలలో కూడా ఒక్కోసారి ఒక్కోలా అవుతారు. మాల తప్పక ఉంటుంది. రుద్రమాల, విష్ణుమాల - అది ఆత్మల మాల, ఇది శారీరిక మాల. దీనిని అర్థము చేసుకునేందుకు చాలా మంచి విశాల బుద్ధి, స్వచ్ఛ బుద్ధి కావాలి. నమ్మకస్తులుగా, ఆజ్ఞాకారులుగా ఉండి సదా శ్రీమతము పై గమనముంచుతూ ఉండాలి. శివబాబా ఎంత గొప్ప సర్వీసు చేస్తున్నారు! **ఓ పతితపావనా!** రండి అని అంటారు. బాబా పావన ప్రపంచాన్ని స్థాపన చేస్తారు. మళ్ళీ అదే పతితమౌతుంది. మళ్ళీ దానినే పావనముగా చేసేందుకు తండ్రి రావలసి వస్తుంది. ఈ సమయములో వారు చాలా అద్భుతమైన పాత్ర చేస్తారు. ఈ సమయములో అందుకే పరమపిత పరమాత్మ బలిహారమై పాత్ర చేస్తారు, నంబర్‌వన్ స్మృతిచిహ్నము ఒక్కరిదే. ఎవరైతే అన్నీ చేస్తారో వారి జయంతినే జరుపుకుంటారు. ఎవరిని తయారు చేస్తారో వారికి ఎంత మహిమ ఉంది! మిగిలిన మనుష్య మాత్రులందరూ ఈ సమయములో పతిత భ్రష్టాచారులుగా ఉన్నారు. సత్యయుగములో శ్రేష్ఠాచారులుగా, ఫరిస్తాలుగా ఉండేవారు. రాత్రికి పగలుకున్నంత తేడా ఉంది. ఇప్పుడు మనము శివబాబా నుండి వారసత్వము తీసుకుంటున్నాము. ఇప్పుడు మనము ఏమి జరుపుకోవాలి. భక్తిమార్గములోనే జరుపుకోవడం ఉంటుంది. ఈ సమయములో శ్రీమతమును అనుసరించి మీరు బాగా పురుషార్థము చేయాలి. సర్వీసు చేయాలి. ఈ ప్రదర్శనీ చూపి అర్థం చేయించే పద్ధతి చాలా బాగుంది. ఈశ్వరీయ సర్వీసు పైన పిల్లలు పూర్తిగా గమనముంచాలి. ఎవరైతే ఈశ్వరీయ ఖజానాతో పాలన చేయబడ్తారో వారు పూర్తిగా సర్వీసు చేయాలి. తద్వారా త్వర త్వరగా మానవుల కళ్యాణము జరగాలి. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. ఉన్నతి చెందే కళలోకి వెళ్లేందుకు అడుగడుగునా శ్రీమతమును అనుసరించాలి. తండ్రిని యదార్థముగా గుర్తించి దేహీ-అభిమానులై పూర్తిగా గౌరవముంచాలి.
2. ఈశ్వరీయ సేవ పై పూర్తి గమనముంచాలి. స్మృతి ద్వారా బుద్ధిని స్వచ్ఛంగా, విశాలంగా తయారు చేసుకోవాలి.

## వరదానము :-" తండ్రి తోడు ద్వారా అసంభవాన్ని సంభవములోకి మార్చే సహజ సఫలతామూర్త్ భవ "

తండ్రిని జతలో ఉంచుకోవడం అనగా ఒకే బలము మరియు ఒకే నమ్మకముంచి ప్రతి కార్యాన్ని చేయడం - ఇదే సఫలతామూర్తిగా అయ్యేందుకు సహజమైన(సులభమైన) పద్ధతి. దీని ద్వారా ఎంత కష్టమైన కార్యమైనా, అసంభవమనుకున్నది కూడా సంభవంగా కనిపిస్తుంది. బ్రాహ్మణ జీవితములో ఏ పని అయినా అది స్థూలమైనది కావచ్చు లేక ఆత్మిక పురుషార్థము కావచ్చు, అసంభవమగుటకు వీలు లేదు. సర్వశక్తివంతుడైన తండ్రి జతలో ఉంటే పర్వతము కూడా అవగింజ వలె అయిపోతుంది. ఏమవుతుంది, ఎలా అవుతుంది అనే సంకల్పము కూడా రాదు.

## స్లోగన్ :- " సమయం యొక్క మహత్వాన్ని తెలుసుకుంటే సర్వ ప్రాప్తుల ఖజానాలతో సంపన్నమైపోతారు "